TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 212 | శనివారం 25-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

## కేంద్ర క్యాబినెట్ కీలక భేటీ..

### లీకులకు చెక్ పెట్టే బిల్లుపై చర్చ

- ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం.
- పేపర్ లీకులకు అడ్డుకట్ట వేసే కొత్త బిల్లుపై చర్చ.
- కఠిన శిక్షలు, భారీ జరిమానాలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ప్రతిపాదన.
- క్యాబినెట్ సూచనలతో బిల్లుకు తుదిరూపం ఇవ్వనున్న కేంద్రం.

2లో



## పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, రూ.10కోట్ల జరిమానా?:

### బిల్లుకు క్యాబినెట్ ఆమోదం

పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. పేజి 2లో ▶

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

### ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు





డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఃద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్ధవరంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.




### 20 ఏళ్లకు సరిపడా

## బొగ్గు నిల్వలు



- విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా ఏర్పాట్లు
- క్షేత్రస్థాయి పర్యటనలతో సమీక్షిస్తున్నాం
- భద్రాద్రి జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి

సింగరేణి బొగ్గు బ్లాకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే సంస్థ ఉనికికే తీవ్ర ప్రమాదమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ, గతంలో వేలంలో పాల్గొనకపోవడం వల్లే రెండు బొగ్గు బ్లాకులు ప్రైవేటు పరం అయ్యాయని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిని మార్చి సింగరేణిని వేలం పాటల్లో పాల్గొనేలా అనుమతులు ఇచ్చామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రాబోయే 20 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక సమన్వయంతో సరిచేస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం బిఆర్ఎస్, బిజెపిలు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపకుండా, తాడిచెర్ల బ్లాక్‌ను అడ్డుపెట్టుకుని ఇప్పుడు సింగరేణిపై నకిలీ ప్రేమ ఒలకబోస్తున్నారని, ఈ విషయాన్ని కార్మికులు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్‌కు తగ్గట్టుగా సరైన ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లే నేడు తీవ్ర బొగ్గు కొరతను ఎదుర్కోవాల్సి వస్తోందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్పష్టం చేశారు. పేజి 2లో ▶



## నీట్ పేపర్ లీకైన నెలన్నరకు కేటీఆర్ నిద్రలేచారు: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదు?దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారు" అని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు.

## బళ్లారి-గుంతకల్లు మధ్య అదనంగా రెండు రైల్వే లైన్లు: అశ్వినీ వైష్ణవ్



- బళ్లారి--గుంతకల్లు మధ్య మరో రెండు రైల్వే లైన్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం.
- 46 కి.మీ మేర 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణం.
- ప్రాజెక్టు వ్యయం రూ.1,264 కోట్లు.
- ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు మెరుగైన రైల్వే అనుసంధానం.

దిల్లీ: కర్ణాటకలోని బళ్లారి, ఏపీలోని గుంతకల్లు (అనంతపురం జిల్లా) మధ్య అదనంగా రెండు రైల్వే లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బళ్లారి-గుంతకల్లు మధ్య 46 కి.మీ మేర రూ.1,264 కోట్లతో మూడు, నాలుగో రైల్వే లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అదనపు లైన్లతో ఏపీ, కర్ణాటకకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ లైన్‌లో వేదవతి నదిపై వంతెన నిర్మిస్తామన్నారు. ఈ రైల్వే లైన్లతో ఏటా అదనంగా 1.60 కోట్ల టన్నుల సరకు రవాణాకు అవకాశం కలుగుతుందని చెప్పారు.

## పార్వతీపురం మన్యం జిల్లాకు కుంకీ ఏనుగులు

### మంగళగిరి వద్ద స్వాగతించిన డిప్యూటి సిఎం పవన్



పలమనేరు ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపు నుంచి జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగులను పార్వతీపురం మన్యం జిల్లాకు అటవీశాఖ అధికారులు తరలిస్తున్నారు. సీతానగరం మండలం గుచ్చిమి వద్ద ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల క్యాంపుకు తరలించనున్నారు. మన్యం జిల్లాకు వెళ్లే మార్గంలో మంగళగిరిలోని డిప్యూటీ సీఎం కార్యాలయం వద్దకు రెండు కుంకీ ఏనుగులు చేరుకు... పేజి 2లో ▶

## ఆ వార్తలు అవాస్తవం..

### బీఆర్‌ఎస్‌లోనే ఉంటా: ఎమ్మెల్యే మల్లారెడ్డి

రసూల్‌పురా (హైదరాబాద్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతారని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం కంటోన్మెంట్ జయనగర్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయం ఆవరణలో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలిసి మల్లారెడ్డి కేక్ కోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని.. పేజి 2లో ▶



# సంపాదకీయం

## పగ్గాలున్నా పరుగులు ఆపలేరు!

ఊహించినవీ ఉద్దేశించినవీ యథాతథంగా జరగటం మానవజీవితంలో చాలా అరుదు. ఉద్దేశాలు, ఊహలు లేకుండా వ్యక్తులూ ఉండరు. బృందాలూ ఉండవు. కానీ చాలా సందర్భాల్లో వారు ఊహించని, కోరుకోని ఫలితాలు కలుగుతూ ఉంటాయి. అందుకే సంఘటనలను వ్యక్తుల సదుద్దేశాలు, దురుద్దేశాల ఆధారంగా అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తే మనముందు ఎప్పుడూ అసమగ్రచిత్రమే కనపడుతుంది. సోషల్ మీడియాను అభివృద్ధి చేసినవారు ఉద్దేశించింది ఒకటి. జరుగుతోంది మరొకటి. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వాలనూ నిరంకుశ ధోరణులను వ్యతిరేకించే వ్యక్తులకూ శక్తులకూ సోషల్‌మీడియా వేదిక అవుతుందని ఆ మీడియా రూపకర్తలు అనుకోలేదు. మన కళ్లెదుట తీవ్రమవుతున్న కాక్రోచ్ ఉద్యమమే దీనికి నిదర్శనం. ఇప్పటికీ సోషల్ మీడియా యాజమాన్యాల లక్ష్యాలు వేరు. వారి ప్రధాన ఉద్దేశం లాభాలను పొందటమే కావచ్చు. కానీ దానికి భిన్నమైన రాజకీయ లక్ష్యాలకు సోషల్ మీడియా ఆలంబనగా మారుతోంది. అననుకూల భావాలను, ప్రభుత్వాలను ఇబ్బందిపెట్టే రాజకీయ లక్ష్యాలను సోషల్ మీడియా వేదికలపైకి రాకుండా చూడటానికి ఎన్ని వడపోతలూ, జల్లెడలూ పెట్టినా వాటిని నిరోధించలేని స్థాయికి పరిస్థితి వెళ్లింది. కోట్లాదిమందికి భావ భాగస్వామ్యం కల్పించే వేదికలను సృష్టించిన తర్వాత, వ్యాపారమంతా దాని చుట్టూ కేంద్రీకృతమైన తర్వాత అనుకున్నట్లుగా వాటిని నియంత్రించటం ఒకపట్టాన సాధ్యంకాదు. బహుశా మానవచరిత్రలోనే ఇంత విస్తృతస్థాయిలో భావాల మార్పిడికి, భావాల సంఘర్షణకు వందల కోట్ల మందికి అవకాశం కల్పించటం ఎప్పుడూ జరగలేదు. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లకు సమాజంలో ఉన్న భావాల మీద కూడా ఆధిపత్యం ఉంటుందని కారల్ మార్క్స్ ఎప్పుడో సూత్రీకరించారు. అంటే ఆ భావాలు సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి దోహదం చేస్తాయనీ ఆ ఆధిపత్యం సహజసిద్ధమైందన్న భ్రమలో అవి ఉంచుతాయనీ ఆయన చెప్పింది స్థూలంగా నిజమే కావచ్చు. కానీ సోషల్ మీడియా ఆ భావాల పట్టుని కొంతమేరకు కదిలేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను అనుకున్న రీతిలో నియంత్రించలేని విధంగా దాంట్లో ఏర్పాటు ఉండటమే దీనికి కారణం. దాని పునాదే కోట్లాది అభిరుచులు, ఆకాంక్షలు, భావాలు, ఉద్దేశాలపై ఆధారపడి ఉంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. సార్వజనీన ఓటుహక్కులా భావవ్యక్తీకరణ సార్వజనీనం అయిపోతోంది.

విదేశీ విరాళాలను క్రమబద్ధీకరించే పేరిట దేశంలో స్వచ్ఛంద సంస్థలన్నిటినీ ఏదోవిధంగా నియంత్రించి, అవి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ తమ గొంతుకలకు సాక్షికంగానే అవకాశం కల్పిస్తున్నాయన్న భావనకు వచ్చిన తర్వాత అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం ప్రారంభమైంది. పాలకులు చేస్తున్న తప్పులకు జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తూ పదవుల నుంచి దిగిపోవాలని కోరటమూ ఎక్కువైంది. పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం మన దేశంలో ఎన్నడూ జరగలేదు. సోషల్ మీడియా ద్వారా ప్రజలు సంఘటితమవ్వటం కొద్దికాలమే ఉండొచ్చు. అన్యాయాలనూ, అక్రమాలనూ ప్రశ్నించే భావాల వేడి కొద్దికాలం తర్వాత చల్లబడనూ వచ్చు. కాక్రోచ్ ఉద్యమం ఉధృతీ తగ్గొచ్చు. కానీ సంప్రదాయ ప్రతిపక్షాలకు విశ్వసనీయత అంతంతమాత్రంగా ఉన్నప్పుడు తాత్కాలిక ఉద్యమాలు సైతం ప్రజాస్వామ్యాన్ని ఎంతోకొంత మేరకు నిలబెడతాయి. పాలకులను జవాబుదారీ పీఠం ఎక్కేలా చేయగలుగుతాయి. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అవ్వటానికి పరిహారంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కోరటాన్ని ఈ కోణం నుంచే చూడాలి. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు.

సమాజంలో అన్ని వ్యవస్థలను ఒకే భావజాలానికి అనుగుణంగా మార్చివేసి, అసమ్మతిలేకుండా చేయటానికి గట్టిగా ప్రయత్నాలు జరిగిన చోట వాటిని వ్యతిరేకించటానికి సోషల్ మీడియానే ప్రధాన వాహికగా పనిచేసింది. అరబ్ స్ప్రింగ్ (2010--2012) పేరిట ట్యునీషియా, ఈజిప్టు, లిబియా, యెమెన్‌ల్లో జరిగిన ఆందోళనల్లో సోషల్‌మీడియా నిర్వహించిన పాత్రపై ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం కోసమే యువత అక్కడ వీధులకు ఎక్కింది. హాంకాంగ్‌లో 2019 నాటి ప్రజాస్వామ్య ఉద్యమం, ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ పేరుతో వాతావరణ మార్పులపై 150కి పైగా దేశాల్లో జరిగిన ఆందోళనలు, 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగుబాటు, కెన్యాలో జెన్--జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. సోషల్ మీడియా వల్ల అంతా మంచే జరుగుతోందా? చెడు జరగటం లేదా? అని తర్కించుకుంటే వచ్చే సమాధానం భిన్నంగానే ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను ఆధారంచేసుకుని హిట్లర్, ముసోలినీ లాంటి నియంతలు రాజ్యాధిపతులయ్యారు. మత, తెగ ఉద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల ఊచకోతకు కారణమైన సంకుచితత్వ నేతలూ ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకునే అధికార పీఠాలను ఎక్కారు. నిరంతరం ఒక మతాన్ని బూచీగా చూపించి ఆ మతానికి చెందిన ప్రజలను అభద్రతతో జీవించేలా చేస్తున్న నేతలూ ప్రజాస్వామ్యం ఆసరాతోనే వరుసగా ఎన్నికవుతున్నారు. ఈ విపరీతాలూ అనర్థాలూ ఉన్నంత మాత్రాన మొత్తం ప్రజాస్వామ్యాన్నే పక్కన పెట్టలేం. ప్రజాస్వామ్య రాజకీయాలతోనే వాటిని ఎదుర్కొనటానికీ, ఓడించటానికీ ప్రయత్నాలూ, ఉద్యమాలూ జరిగాయి. సోషల్ మీడియాకూ ఇదే వర్తిస్తుంది. చక్రవర్తులూ రాజులూ పాదుషాలూ నవాబులూ అధికారం చలాయిస్తున్న కాలంలో పన్నులు కట్టే వ్యాపారులు.. మాకూ ప్రభుత్వ పాలనలో ప్రాతినిధ్యం ఉండాలని డిమాండు చేయటంతో ప్రజాస్వామ్యానికి బీజాలు పడ్డాయి. పన్నులు కట్టే వారికి ఓటు హక్కుని కల్పించాలన్న భావనతోనే ప్రాతినిధ్యపాలనా పద్ధతి మొదలైంది. భారత రాజ్యాంగ పరిషత్తుకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో కూడా ఓటువేసే హక్కు ఆనాడు పన్నులు కట్టే వారికే దక్కింది. ఆనాటికి వాళ్ల సంఖ్య జనాభాలో 10 నుంచి 15 శాతం లోపే ఉంది.

ప్రపంచవ్యాప్తంగా ఇంత పరిమితంగా మొదలైన ప్రజాస్వామ్యం అనుకోని విధంగా అందరికీ ఓటుహక్కు కల్పించటానికి కారణమైంది. వ్యాపారవర్గం ఉద్దేశం ఒకటి, వివిధ పరిణామాల కలయికతో జరిగింది మరొకటి. పారిశ్రామిక విప్లవం మొదలైన తర్వాత ఫ్యాక్టరీలు పుట్టుకొచ్చి, వాటితో పాటు కార్మికులు పెరిగిన తర్వాత వాళ్ల పోరాటాలతో ఓటుహక్కుని విస్తరించక తప్పలేదు. స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాల కోసమూ, ఫొటోలను, సందేశాలను, వ్యక్తిగత వివరాలను పంచుకోటానికీ, ఆన్‌లైన్ ద్వారా అభిరుచుల కలబోతల కోసం మొదలైన సోషల్‌మీడియా... రాజకీయ బల సమీకరణలకూ, పౌరుల విస్తృత కార్యాచరణకూ, పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకూ వేదికై ప్రభుత్వాలను గద్దె దింపే స్థాయికి చేరుకుంటుందని ఒకప్పుడు ఊహించలేదు. అందుకే ప్రాచీన చరిత్రలోనైనా, ఆధునిక చరిత్రలోనైనా ఊహించని, ఉద్దేశించని ఫలితాలను విశ్లేషించటమే చాలా కీలకం. రష్యన్ మహారచయిత టాల్‌స్టాయ్ తన మహోన్నత రచనైన యుద్ధం--శాంతి నవలలో కూడా దీన్నే ప్రధానంగా చెబుతారు. టాల్‌స్టాయ్ ప్రకారం.. వ్యక్తులు ఒక ఉద్దేశంతో చర్యలు చేపడతారు. కానీ ఆ చర్యల తుదిఫలితాలు వారి నియంత్రణలో ఉండవు. లక్షలాది మంది చర్యలు పరస్పరం కలిసిపోయి, పరస్పరం ప్రభావితమై ఎవరూ ఊహించని ఫలితాలను సృష్టిస్తాయి. వ్యక్తుల సంకల్పాలు చాలా ముఖ్యమైనా వాటిని బట్టే పూర్తిగా చరిత్రను వివరించలేం. సోషల్ మీడియాను ఈ దృష్టి నుంచి చూస్తేనే దాని పాత్ర అర్థం అవుతుంది. దాని సృష్టికర్తలు ఊహించని పరిణామాలకే అది ఊతం ఇస్తోంది.

సోషల్‌మీడియాలో వివిధ వయస్సుల వాళ్లు క్రియాశీలకంగా ఉన్నా అవసరమైనప్పుడు కార్యాచరణకు అడుగులు వేసేది యువతే.

## పార్వతీపురం మన్యం జిల్లాకు కుంకీ ఏనుగులు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కుంకీ ఏనుగులకు స్వాగతం పలికి, ఆహారం అందించారు. అనంతరం మన్యం జిల్లా గుచ్చిమి క్యాంపునకు ఏనుగులు పయనమయ్యాయి. గురువారం సాయంత్రమే పార్వతీపురం జిల్లాకు తరలించేందుకు ముసలిమడుగు క్యాంపు నుంచి రెండు కుంకీ ఏనుగులను అటవీ శాఖ అధికారులు లారీల్లో ఎక్కించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఏనుగుల తరలింపును చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కొనసాగుతున్న ఏనుగుల దాడులను నియంత్రించేందుకు గుచ్చిమి వద్ద ప్రత్యేక ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ ఎలిఫెంట్ క్యాంపు ఆగస్టు 12న ఏనుగుల దినోత్సవం సందర్భంగా అధికారికంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానుంది. కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని అటవీ శాఖ అధికారి చలపతిరావు తెలిపారు. పలమనేరు ప్రాంతంలో ఏనుగుల గుంపును కంట్రోల్ చేసే నేర్పు వీటికి ఉందన్నారు. పలు సందర్భాల్లో వీటి పని తీరుతో పంటలను కాపాడాయని చెప్పుకొచ్చారు. గతంలోనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కర్ణాటక ప్రభుత్వంతో ఈ కుంకీ ఏనుగులపై ఒప్పందం చేసుకున్నారని అన్నారు. 16 నెలల అభిమన్యుని ఏపీకి కర్ణాటక ప్రభుత్వం కానుకగా ఇచ్చిందన్నారు. ఇప్పుడు జయంత్, అభిమన్యుల ద్వారా మన్యం ప్రాంతంలో కూడా ఏనుగుల గుంపును నిలువరిస్తామని తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రజలకు, పొలాలకు రక్షణగా కుంకీ ఏనుగులు నిలుస్తాయని చలపతిరావు వెల్లడించారు.

## 20 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు

మొదటిపేజీ తరువాయి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని భట్టితదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. గనిలోకి స్వయంగా వెళ్లి బొగ్గు నాణ్యతను పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి, గని పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించాను. రాష్ట్ర భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వేలం ప్రక్రియలో చురుగ్గా పాల్గొని కొత్త బొగ్గు బ్లాకులను సొంతం చేసుకోవాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడం శుభపరిణామం. అలాగే భవిష్యత్ అవసరాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ కూడా సింగరేణికే దక్కేలా మన ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి ప్రయోజనాల పరిరక్షణే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని భట్టి అన్నారు.

## ఆ వార్తలు అవాస్తవం..

### బీఆర్ఎస్‌లోనే ఉంటా: ఎమ్మెల్యే మల్లారెడ్డి

మొదటిపేజీ తరువాయి

పార్టీని వీడుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. యూనివర్సిటీల ఏర్పాటు విషయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి కేంద్ర పెద్దలను కలిశామన్నారు. దాన్ని రాజకీయ కోణంలో చూస్తూ తాను భాజపాలో చేరుతున్నట్లు వక్రీకరించారని చెప్పారు.

## పదవుల కోసం జనసేన ఏర్పాటు చేయలేదు

**రాష్ట్ర అభివృద్ధి కోసమే పవన్ పార్టీ ఏర్పాటు**

**ఎపిని విభజించి నిధులు ఇవ్వకుండా అన్యాయం చేశారు**

**పార్టీలో గ్రూపులు లేవు..ఉన్నదంతతా పవన్ కళ్యాణ్ గ్రూపు మాత్రమే**

**స్వార్థ రాజకీయాలకు జనసేన దూరం...అలాంటివి ప్రోత్సహించదు**

**కార్యకర్తలే మన పత్రికలు, ఛానళ్లు కూడా**

**విజయవాడ జనసేన పార్టీ నేతల సమీక్షా సమావేశంలో నాదెండ్ల మనోహర్**

విజయవాడ,జూలై24: జనసేన పార్టీ బలోపేతం కోసం ఎంతోమంది పని చేస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర హితం కోసం కూటమి ధర్మానికి కట్టుబడి అందరూ కలిసి పని చేశారని చెప్పారు. జనసేన.. ఏనాడు స్వార్థ రాజకీయాలను ప్రోత్సహించలేదని.. ఆ ఆలోచన కూడా చేయలేదని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పని చేసే వారిని గుర్తించి ప్రోత్సహిస్తామని అన్నారు. అంతా కలిసి కట్టుగా ఉండటం వల్లే ఈ ప్రస్థానం కొనసాగిస్తున్నామన్నారు.

శుక్రవారం విజయవాడలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల జనసేన నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజించి ఏపీకి అవసరమైన నిధులు ఇవ్వకుండా అన్యాయం చేశారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ పదవుల కోసం జనసేన ఏర్పాటు చేయలేదని.. యువతను, మహిళలను చైతన్యపరిచేలా జనసేన పార్టీ తొలి అడుగులు వేసిందన్నారు. విజయవాడ నగరం ఉద్యమాల గడ్డ అని.. రాజకీయ చైతన్యానికి మరోపేరని మంత్రి అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయవాడ నాయకులకు గుర్తింపు ఉండేదన్నారు. మూడు రాజధానులని వైసీపీ అధినేత జగన్ రెడ్డి ప్రకటిస్తే.. జనసేన ఉద్యమం చేసిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన పార్టీ జనసేన అని తెలిపారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి చాలా మంది భయపడ్డారని.. జనసేనలో వీర మహిళలు, జన సైనికులు ధైర్యంగా నిలబడ్డారన్నారు. విజయవాడ కార్పొరేషన్‌లో 34 స్థానాల్లో నిలబడ్డారని.. క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొని నిలబడిన తీరు ఆదర్శమని కొనియాడారు.పార్టీలో ఉన్న కార్యకర్తల మాట నాయకులు వినాలని.. ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరూ నోరు జారవద్దని, అనవసర రాద్ధాంతాలు చేయవద్దని సూచించారు. జనసేనలో మరో గ్రూపు లేదని... ఎవరైనా పవన్ కళ్యాణ్ గ్రూపే అని చెప్పుకొచ్చారు. 'కూటమిలో మనం ఉన్నాం.. కలిసికట్టుగా పనిచేయాలి. అభిప్రాయబేధాలు ఉంటే కూర్చుని, చర్చించి పరిష్కరించుకోండి. జనసేన సభ్యత్వం నమోదులో కీలకంగా చాలా మంది పని చేశారు. జనవాణి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో జనవాణిని నిర్వహించాలి. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టాలి. మనకు పత్రికలు, ఛానళ్లు లేవు.. కార్యకర్తలే మన మీడియా. పవన్ ఆలోచనలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి' అంటూ పిలుపునిచ్చారు.

నేడు పంచాయతీ రాజ్ శాఖను దేశంలోనే రెండో స్థానంలో పవన్ కళ్యాణ్ నిలబెట్టారని మంత్రి తెలిపారు. విజయవాడలోని 64 డివిజన్లలో జనసేన బలోపేతం కావాలన్నారు. కేవలం బీఫాం తెచ్చుకుని నిలబడితే గెలుపు రాదని.. కూటమిలో ఉన్నాం కాబట్టి అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. ఎక్కడ జనసేన సీట్లు తీసుకోవాలి, ఎక్కడ పోటీ చేయాలనేది అధినేత పవన్ కళ్యాణ్ అంతిమంగా నిర్ణయిస్తారన్నారు. అన్ని ప్రాంతాల్లో త్వరలోనే జనసేనాని కమిటీలను ప్రకటిస్తారన్నారు. గతంలో జనసేనకు వచ్చిన ఓట్లు, సీట్లను పరిశీలించి.. కొత్త ప్రణాళికతో ముందుకు సాగాలని నేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్దేశిరచారు.జనసేన పార్టీ కోసం గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు సొంతంగా పనిచేశారని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర బాగు కోసం కూటమి విజయం సాధించాలని అందరం కలిసి పని చేశామని చెప్పారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం అంతా సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మిత్రపక్ష పార్టీల నేతలను కలుపుకుని ముందుకు సాగాలని నేతలకు సూచించారు.పార్టీ కోసం పని చేసే వారిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గుర్తించి ప్రోత్సహిస్తారని మంత్రి తెలిపారు. జనసేన పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లేలా పని చేయాలని అన్నారు. జనసేన పార్టీ బలం పెంచుకోవడం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. నేడు జనసేనలో ఎంతోమంది సామాన్య కార్యకర్తగా పని చేసి వివిధ హోదాలు సంపాదించారన్నారు. రాష్ట్రంలో వైసీపీ వంటి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేలా అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ కార్పొరేషన్‌లో కూటమి పార్టీ విజయకేతనం ఎగురవేయాలని కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే బొలిశెట్టి , సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, రావి సౌజన్యతో పాటు విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# చదువే పిల్లలకు

### శాశ్వత ఆస్తి: సీఎం చంద్రబాబు






స్థానిక గిరిజనుల ఉద్యోగావకాశాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**విద్యార్థుల ప్రోత్సాహం**

సభలో విద్యార్థుల ఆశయాలను సీఎం, మంత్రి లోకేష్ అభినందించారు. "డ్రగ్స్ వద్దు బ్రో" హ్యాండ్‌బుక్‌ను, "బడి కోసం డోనర్" వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పాఠశాలలకు విరాళాలు ప్రకటించిన దాతలను సీఎం అభినందించారు.

**ప్రత్యక్ష పరిశీలన**

పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు పరిశీలించి, స్మార్ట్ బోర్డు ద్వారా ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించారు. విద్యార్థులు నాటిన మొక్కల వివరాలను పరిశీలించి అభినందించారు.

**మధ్యాహ్న భోజనం**

కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యతను అడిగి తెలుసుకుంటూ, సాయంత్రం వేళ కూడా చిక్కిలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర క్యాబినెట్ కీలక భేటీ..

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నపత్రాల లీక్ ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ స్వయంగా హామీ ఇచ్చిన నేపథ్యంలో.. కేంద్ర క్యాబినెట్ శుక్రవారం సమావేశమైంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరుగుతోన్న ఈ భేటీలో.. పేపర్ లీకులకు చెక్ పెట్టే దిశగా ముసాయిదా బిల్లుపై మంత్రులు చర్చిస్తున్నారు. ఈ నేరాలను అరికట్టేందుకు కఠిన శిక్షలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి అంశాలపై చర్చలు జరుపుతున్నారు.

క్యాబినెట్ మంత్రుల సూచనల మేరకు ఈ ముసాయిదా బిల్లుకు తుదిరూపం ఇవ్వనున్నారు. ఈ బిల్లు గురించి గురువారం అర్ధరాత్రి ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు. వచ్చే సోమవారం దీన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కొన్ని సవరణలు చేసి ఈ బిల్లును తీసుకురానున్నారు. ప్రస్తుతం ఉన్న జైలు శిక్షలను మరింత పెంచడంతో పాటు దోషులకు భారీ జరిమానా విధించేలా చట్టాన్ని సవరించనున్నట్లు తెలుస్తోంది.

**కేంద్రంతో సీజేపీ చర్చలు..**

మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో కేంద్రం నేడు చర్చలు చేపట్టింది. దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సీజేపీ ప్రతినిధులతో కేంద్రమంత్రులు సమావేశమయ్యారు. నీట్ అంశంతో పాటు విద్యావ్యవస్థలో పలు సంస్కరణలపై వీరు చర్చించారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు తాము ఆందోళనలను విరమించబోమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పునరుద్ఘాటించారు.

## పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, రూ.10కోట్ల జరిమానా?:

మొదటిపేజీ తరువాయి

ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది.

ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది.

నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

# బిజెపి నాయకులకు సర్ పై అవగాహన

**- ముఖ్య అతిథిగా బిజెపి సర్ కన్వీనర్ అంటోని రెడ్డి**






ముస్తాబాద్/ జులై 24 ప్రజా దివాస్
ముస్తాబాద్ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల పార్టీ కార్యాలయంలో ఈరోజు మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ అధ్యక్షతన, ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (సర్ ) కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించబడింది. మండలం లోని అన్ని గ్రామాలకు చెందిన తొలి సభ్యులు, బూత్ స్థాయి బాధ్యులు, బి ఎల్ ఏ-2లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర సర్ కన్వీనర్ ఆంటోనీ రెడ్డి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి సన్మానం చేశారు ఈ సందర్భంగా ఆంటోనీ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అత్యంత బాధ్యతతో నిర్వహించాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని,మరణించిన వారు,శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణ, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై బూత్ స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.రాష్ట్ర పార్టీ ఇచ్చిన లక్ష్యాలనుప్రతి మండలంలో సమర్థవంతంగా అమలు చేసి, సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటిని చేరుకుని ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ మండలం లో జరుగుతున్న సర్ కార్యక్రమ పురోగతిపై సమగ్ర నివేదికను వివరించారు.ప్రతి మండలంలోని పరిస్థితులను సమీక్షిస్తూ, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై తొలి సభ్యులు, బూత్ లెవెల్ ఏజెంట్ 2లతో చర్చించారు. బూత్‌ల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి నిర్ణీత గడువులోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు నాయకులు కూడా సర్ కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా,తప్పులు లేకుండా ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శులు ఎదునూరి గోపి,బుచ్చెల్లి మహేశ్వరిలు, ఉప సర్పంచ్ లు కోలా కృష్ణా, గాడిచర్ల శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇంచార్జి లు బాధ నరేష్, బెదుర ప్రశాంత్, వరి వెంకటేష్ సర్దని నందం, కార్తీక్ రెడ్డి, భగత్, యాదగిరి, రాయం రాజు దీటి సత్తయ్య, పద్మ, అజయ్, వినయ్, చంద్రశేఖర్, పెంటం నరేష్, పద్మ,బుచ్చిరెడ్డి, మహేందర్,తిరుపతి, ప్రశాంత్,శ్రీకాంత్ గణేష్రఘుపతి,సునీల్, శ్యామ్,సత్యం ఎల్లం, బూత్ లెవెల్ ఏజెంట్-2లు మరియు బూత్ అధ్యక్షులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.సమావేశం అనంతరం ప్రతి మండలంలో సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఓటరిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, ప్రతి బూత్‌లో పార్టీ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు

# వీటీఏడీఏ పనులను వేగవంతం చేయాలి

**- గడువులోగా ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలి**
**- గుడి చెరువు సుందరీకరణ తుది దశ పనులు పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వేములవాడ/ ప్రజాదివాస్ జూలై 24
వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, గుడి చెరువు బండ్ పార్క్ అభివృద్ధి, సుందరీకరణ, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, 80 ఫీట్ల రహదారి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను ప్రణాళిక ప్రకారం దశల వారీగా చేపట్టి, వేగవంతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన పురోగతిని అధికారులను అడిగి జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని, నిర్మాణ ప్రక్రియలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు.అనంతరం గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆర్చ్, తదితర తుది దశ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధంగా చేయాలని ఆదేశించారు.అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ గడువులోగా ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చూడాలని, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల



రహదారి విస్తరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిలో వేగం పెంచాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు.సందర్శనలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ భీమ్లా, ఈఈ నరసింహ చారి, పర్యాటక శాఖ ఎస్ఈ సరిత,ఆలయ ఈఈ రాజేష్, నీటి పారుదల ఈఈ దయాకర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, తదితరులు ఉన్నారు.

# ముస్తాబాద్‌లో ప్రారంభమైన ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సేవా కేంద్రం

ముస్తాబాద్,జూలై 24 ప్రజా దివాస్
ప్రజలకు ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముస్తాబాద్‌లోని అమెజాన్ సీఎస్‌సీ ఆన్‌లైన్ సర్వీసెస్ వద్ద ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సేవా కేంద్రం ఘనంగా ప్రారంభమైంది.గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకులకు వెళ్లాల్సిన శ్రమ లేకుండా,వారి స్వగ్రామంలోనే నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందించడమే ఈ కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. లభించే ప్రధాన సేవలు బ్యాంకు ఖాతాలు కొత్త ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాల ప్రారంభం.నగదు లావాదేవీలు నగదు జమ చేయడం మరియు సులభంగా ఉపసంహరించుకోవడం.డిజిటల్ సేవలు ఆధార్ ఆధారిత బ్యాంకింగ్ సేవలు ( ఏఈపిఎస్




)నగదు బదిలీ.ఖాతా వివరాలు బ్యాలెన్స్ పరిశీలన మరియు మినీ స్టేట్‌మెంట్ సేవలు.ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కరువు పనుల వేతనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిధులు, గ్యాస్ సబ్సిడీ, పింఛన్లు మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యే నగదును ఆధార్ ఆధారిత సేవల ద్వారా ఇక్కడే సులభంగా విత్‌డ్రా చేసుకోవచ్చని నిర్వాహకులు వివరించారు.ప్రకటన ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకొని, మీ సమయాన్ని మరియు ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము ప్రారంభోత్సవకార్యక్రమంలో మహేందర్ సతీష్ తదితరులు ముఖ్య అతితులుగా పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రజలు ఈ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని వారు సూచించారు.సంప్రదించవలసిన వివరాలు చిరునామా అమెజాన్ సీఎస్‌సీ ఆన్‌లైన్ సర్వీసెస్, స్టేట్ బ్యాంక్ ఎదురుగా,ముస్తాబాద్. ఫోన్ నంబర్ 8096444958 కట్కూరి పరమేష్ ప్రచార ప్రతినిధి ( పిఆర్ఓ )అమెజాన్ సీఎస్‌సీ ఆన్‌లైన్ సర్వీసెస్, ముస్తాబాద్.

# ముస్తాబాద్ లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**- చిరు వ్యాపారులకు వందమందికి రక్షణ గొడుగులు అందించిన**
**- మాజీ ఎం పి పి అక్క రాజు శ్రీనివాస్**

ముస్తాబాద్/జూలై 24 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో మాజీ తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మదిన వేడుకలను బి ఆర్ ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొంపల్లి సురేందర్ రావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు అభిమానులతొ కలిసి తెలంగాణ తల్లి విగ్రహం ముందర కేటీఆర్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఆర్భాటాలుగా జరపకుండా వృధా ఖర్చులను తగ్గించి ఇతరులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలని కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు మండల కేంద్రం జిల్లా కేంద్రంలో గల చిరు వ్యాపారులకు వర్షానికి ఎండలకు రక్షణ కవచముగా ఉపయోగపడే గొడుగులను ప్రత్యేకంగా తయారు చేయించి వందమంది చిరు వ్యాపారులకు కేటీఆర్ జన్మదిన సందర్భంగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మాజీ రైతుబంధు మండల అధ్యక్షులు కల్వకుంట్ల గోపాలరావు మాజీ ఎంపీపీ అక్క రాజు శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి మాజీ సర్పంచ్ గాండ్ల సుమతి నల్ల నరసయ్య మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీనివాస్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు కొమ్ము బాలయ్య బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కొమ్మేటరాజు కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు

# కేటీఆర్ జన్మదిన వేడుకలు: ప్రత్యేక పూజలు నిర్వహించిన చల్మెడ లక్ష్మీనరసింహారావు

**- శ్రీరాజరాజేశ్వర స్వామికి కోడె మొక్కులు చెల్లించి, చెక్కపల్లిలో మొక్క నాటిన చల్మెడ**





వేములవాడ/ప్రజాదివాస్ జూలై 24
బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ నియోజకవర్గంలో శుక్రవారం పలు సేవా, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో బి.ఆర్.ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్థానిక నాయకులతో కలసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి (భీమేశ్వర స్వామి) దేవస్థానంలో స్వామివారికి కోడె మొక్కు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం చెక్కపల్లి గ్రామంలో మొక్కనాటి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నాయకులు, కార్యకర్తలు సమాజ హిత కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ మండల సీనియర్ నాయకులు, స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేములవాడలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు

- భీమేశ్వరాలయంలో కోడెమొక్కు...చెల్లించి ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ నాయకులు



వేములవాడ/ప్రజాదివాస్ జూలై 24
బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఌ సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని బిఆర్ఎస్ నాయకులు భీమేశ్వరాలయంలో కోడెమొక్కు చెల్లించి, ప్రత్యేక పూజలు చేసి కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి చందు, మారం కుమార్ తో పాటు పట్టణ నాయకులు తదితరు పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి
- పాఠశాలల బంధు ప్రశాంతంగా విజయవంతం

ముస్తాబాద్/ జూలై 24 ప్రజా దివాస్







ముస్తాబాద్: ఢిల్లీలో తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పార్లమెంట్ ముట్టడికి వెళ్లిన యువత, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గజ్జల రాజు మరియు జిల్లా కార్యదర్శి ఎల్లా బాల్రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో యువత తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం పోలీసుల లాఠి చార్జి బలప్రయోగానికి పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలపై సమాధానం చెప్పాల్సింది పోయి విద్యార్థుల గొంతును అణచివేయడం అత్యంత బాధాకరమన్నారు. లాఠీచార్జ్‌లో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతియుత ర్యాలీ ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించారు కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్జల రాజు, జిల్లా కార్యదర్శి ఏళ్ల బాల్రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రాజు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాలంకారి శ్రీనివాస్, వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ కలకొండ కిషన్‌రావు, మిడిదొడ్డి భాను, దుబ్బాక రాజు, గుండెల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బోయినిపల్లిలో ఎంఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

- మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన: మెనూ ఛార్జీలు, జీతాలు పెంచాలని డిమాండ్
- తాసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓలకు వినతిపత్రాల సమర్పణ

బోయినిపల్లి మండలం/ప్రజాదివాస్ జూలై 24
పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన మెనూ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో మిడ్ డే మీల్స్ కార్మికులు ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓలకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మిడ్ డే మీల్స్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో కోడిగుడ్లు, వంటనూనె, గ్యాస్, పప్పు ధాన్యాలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. ప్రభుత్వం 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థికి 6.78, 6 నుంచి 10వ తరగతి వరకు 10.17 మాత్రమే చెల్లిస్తోందని, బహిరంగ మార్కెట్‌లో గుడ్డు ధర 9 ఉంటే ప్రభుత్వం 6 మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. సరిపోని బడ్జెట్‌తో నాణ్యమైన భోజనం అందించలేక కార్మికులు అప్పులు చేసి, ఆస్తులు అమ్ముకుని పథకాన్ని నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోడిగుడ్లు పెట్టలేదనే కారణంతో ఒక ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.గత 24 ఏళ్లుగా అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వాలు శ్రమదోపిడీ చేస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు 10,000 వేతనం తక్షణమే అమలు చేయాలని డిమాండ్





చేశారు. అలాగే కార్మికులకు డ్రెస్ కోడ్, ప్రమాద ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 60 ఏళ్లు నిండిన వారికి 10,000 పింఛన్ అందించాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మధ్యాహ్న భోజన సేవలను నిలిపివేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అంజవ్వ, కవిత, వెంకయ్య, భారతవ్వ, నడిబొట్టు లక్ష్మి, కవిత, నరసయ్య, మల్లేశం, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బీజేపీ నేతల తీరుపై మండిపడ్డ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- విద్యార్థుల భవిష్యత్తుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శ
- విప్ ఆది శ్రీనివాస్ నివాస ముట్టడిపై సమాధానం చెప్పాలని డిమాండ్
- నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ కృషి చేశారని ప్రశంస

వేములవాడ /ప్రజాదివాస్ జజూలై 24
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆరోపించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసాన్ని ముట్టడించేందుకు బీజేపీ నాయకులు చేసిన ప్రయత్నాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనబెట్టి బీజేపీ నేతలు రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేసి జైళ్లకు పంపడం బాధాకరమన్నారు. అలాగే జైల్లో ఉన్న రాహుల్ గాంధీని ఆయన తల్లి సోనియా గాంధీ కలిసే అవకాశం కూడా ఇవ్వలేదని ఆరోపించారు.విప్ ఆది శ్రీనివాస్ నివాసాన్ని ఏ కారణంతో ముట్టడించేందుకు ప్రయత్నించారో బీజేపీ నాయకులు ప్రజలకు వివరణ ఇవ్వాలని పుల్కం రాజు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, రాజకీయ నాయకులు తమ బాధ్యతలను గుర్తుంచుకుని వ్యవహరించాలని

సూచించారు.నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో ఎవరూ చేయని విధంగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.40 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), రూ.10 కోట్లతో అగ్రహారం డిగ్రీ కళాశాల, మేడిపల్లి మండలంలో రూ.50 కోట్లతో జూనియర్ కళాశాల మంజూరు చేయించారని తెలిపారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, నియోజకవర్గ విద్యార్థుల కోసం



బీజేపీ తరఫున చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు.దేశ సమగ్రత కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై బీజేపీ నేతలు విమర్శలు చేయడం సమంజసం కాదని పుల్కం రాజు అన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై చౌకబారు రాజకీయాలకు పాల్పడితే తాము ఊరుకోబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వరి వద్దు.. ఆరుతడి ముద్దు: స్తంభంపల్లిలో రైతులకు వ్యవసాయాధికారుల పిలుపు

- తక్కువ నీటితోనే ఎక్కువ దిగుబడి: ఏఓ ప్రణీత అవగాహన సదస్సు
- భూగర్భ జలాల పరిరక్షణకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి
- ఆరుతడి పంటలతోనే వ్యవసాయం లాభసాటి: సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్

బోయినిపల్లి మండలం/ప్రజాదివాస్ జూలై 24
తక్కువ నీటి లభ్యత ఉన్న తరుణంలో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకే ప్రాధాన్యమివ్వాలని బోయినపల్లి వ్యవసాయ అధికారి (ఏఓ) ప్రణీత సూచించారు. బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఓ ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షపాతం తక్కువగా ఉన్నందున వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి







అవసరమున్న పంటలకు స్వస్తి చెప్పాలన్నారు. తక్కువ నీటితో పండే కంది, పెసర, మినుము, సజ్జలు, వేరుశనగ, ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరిగి నష్టాల నుంచి బయటపడవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఆరుతడి పంటలకు అందిస్తున్న సబ్సిడీలు, పంట బీమా సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు, ఎరువుల వాడకంపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని, ఉమ్మడి నిర్ణయాలతో ముందుకు సాగితే మంచి దిగుబడులు సాధించవచ్చని భరోసా ఇచ్చారు.

**భూగర్భ జలాల పెంపే లక్ష్యం:**
భూగర్భ జలాలు పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారుల బృందం గ్రామంలో అవగాహన కల్పించింది. బోర్ రిచార్జ్ పాయింట్లు, కమ్యూనిటీ సోక్ పిట్ (ఇంకుడు గుంతల) నిర్మాణాల ప్రాధాన్యతను వివరిస్తూ నేలపై ముగ్గులు వేసి చూపించారు. ప్రతి రైతు తమ చేనులో పంట కుంట, ఇంట్లో ఇంకుడు గుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో రైతులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాఘవపూర్‌లో ఘనంగా వన మహోత్సవం..

**-4 వేల ఈత మొక్కల నాటకం..**
**-గీత కార్మికుల జీవనోపాధికి దోహదం**
**జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి**

ప్రజాదివాస్
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాఘవపూర్ గ్రామంలో భారీ స్థాయిలో ఈత మొక్కల నాటకం చేపట్టారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 4,000 ఈత మొక్కలను నాటారు.కామారెడ్డి సొసైటీ నంబర్-1, నంబర్-2 గ్రూపులకు చెందిన సభ్యులు చెరో 2,000 మొక్కల చొప్పున నాటి పచ్చదనం పెంపొందించేందుకు తమ వంతు సహకారం అందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేసే లక్ష్యంతో ఈత మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ, వాతావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈత, తాటి వనాల పెంపకం ద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా గీత కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు పెరిగితేనే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని సూచించారు.ఏపీవో అన్నపూర్ణ మాట్లాడుతూ, నాటిన మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి మొక్క నిర్వహణ కోసం రూ. 5 చొప్పున ప్రోత్సాహకంగా కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మొక్కలను సంరక్షించి వాటిని పెద్ద చెట్లుగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినీల నరేష్, ట్రైనింగ్ ఏఈఎస్ అరుణ్ చంద్ర, ఎక్సైజ్ సీఐలు సంపత్ కృష్ణ, సుందల్





సింగ్, ఎస్సైలు విక్రమ్ కుమార్, శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ మాధవీలత, గౌడ సంఘం అధ్యక్షులు, గ్రామ ప్రజలు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమం అనంతరం నాటిన మొక్కల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# వేములవాడలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**- కోర్టు ప్రధాన ద్వారం ముందు కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ న్యాయవాదులు**
**- బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం**

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 24
వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రధాన ద్వారం ముందు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం మాజీ







మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుడిసె సదానందం మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనలో ఆయన కేటీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కేటీఆర్ ఆయురారోగ్యాలు కలిగి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ న్యాయవాదులు నడిగోట్ల హరికృష్ణ, నాగరాజు, సుంకపాక నవీన్, బొడ్డు గంగరాజు, పొత్తూరు జనార్దన్, మల్లేష్, అజయ్,బూర సరిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ బిల్లులకే మా అడ్డంకి అభివృద్ధికి కాదు..

**- కామారెడ్డి మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్లు**

ప్రజాదివాస్
కామారెడ్డి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు తీవ్ర ఆరోపణలు చేశారు. శుక్రవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన వారు, కాంగ్రెస్‌బీఆర్ఎస్ పార్టీల తీరును తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య అంతర్గత ఒప్పందాల వల్లే ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నారని విమర్శించారు. పదవుల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాల కారణంగానే ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడిందని, దీనికి బీజేపీకి ఎలాంటి సంబంధం



లేదని స్పష్టం చేశారు."అభివృద్ధి పనులకు మేమెప్పుడూ అడ్డంకి కాదు. ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే దొంగ బిల్లులు, అవినీతి అజెండాలకే మా వ్యతిరేకత" అని పేర్కొన్నారు. గతంలో తిరస్కరించిన అవినీతి బిల్లులనే మళ్లీ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలని ప్రయత్నిస్తున్నందుకే తాము అడ్డుకున్నామని తెలిపారు.మున్సిపల్ సిబ్బందికి అందించే పనిముట్ల కొనుగోళ్లలో సుమారు రూ. 8 లక్షల మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా దొంగ బిల్లులు చెల్లించారని, ఈ వ్యవహారంపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, గడువు ముగిసినప్పటికీ 'తాయ్ బజార్' పేరుతో వ్యాపారుల నుంచి అక్రమంగా వసూళ్లు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే భయపడి చెల్లించవద్దని, అలాంటి బాధితులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సంప్రదిస్తే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మున్సిపల్ పాలనలో పారదర్శకత తీసుకురావాలని, ప్రజాధనాన్ని కాపాడేందుకు అవసరమైన ప్రతి చర్యకు బీజేపీ కట్టుబడి ఉంటుందని కౌన్సిలర్లు పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేములవాడలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 24
వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రధాన రహదారిపై ఈరోజు శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన రెండు ద్విచక్ర



వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వాహనదారుడికి తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా కోరుట్ల బస్టాండ్ మార్గంలో కొంతసేపు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

# విద్యార్థుల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు మానుకోవాలి..

**-రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి**
**బీజేవైఎం**

ప్రజాదివాస్
రాష్ట్రంలో పేరుకుపోయిన రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా అధ్యక్షుడు నంది వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో "ఫీజుల బకాయిలు బీజేపీ లడాయి" కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా నంది వేణు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వల్ల విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాదంలో పడిందని ఆరోపించారు.కాలేజీలకు ప్రభుత్వం బకాయిలు



చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేస్తున్నాయని అన్నారు. దీంతో ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్న విద్యార్థులు అప్పులు చేసి, బంగారం కుదువపెట్టి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థుల సమస్యలపై పెద్ద ఎత్తున మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పుడు విద్యార్థుల పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్యం పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నంది వేణు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీజేపీ, బీజేవైఎం జిల్లా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుద్రవరంలో 'ఎల్ నీనో' కరువు ప్రభావంపై రైతులకు అవగాహన

**- వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి: సర్పంచ్ సునీత రాజిరెడ్డి**

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 24
వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో ఎల్ నీనో వర్షాభావం మరియు కరువు ప్రభావంపై వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక



అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి, ఉప సర్పంచ్ బేజుగాం మహేష్ హాజరయ్యారు. సదస్సులో వ్యవసాయ అధికారులు ూజు, ూజుూ మరియు వీూణూ మాట్లాడుతూ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలు మరియు నీటి యాజమాన్య పద్ధతులపై సమగ్రంగా వివరించారు.అనంతరం గ్రామ సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ కరువు పరిస్థితులను అధిగమించాలని, పంట నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ూవీజ డైరెక్టర్ కత్తి కనుకయ్య, వార్డు సభ్యులు తునికి స్వరూప నరేష్, పార్వతి భూమేష్ గౌడ్, గుండెల్లి శ్రీనివాస్, వంకాయల మహేశ్వర్ పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్‌లు పిల్లి కనుకయ్య, ఏంబెరు దేవరాజు, అనుముల భరత్, తునికి రాజు, పచ్చిమట్ల శ్రీనివాస్ మరియు గ్రామ రైతులు ఊరడి నరసింహ రెడ్డి, ఊరడి రవి, వంకాయల కనుకయ్య, వంకాయల రాజశేఖర్, నాయిని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్నా చౌక్‌కు కదిలిన పటాన్‌చెరు బీఆర్ఎస్ శ్రేణులు.

ప్రజాదివాస్
విద్యార్థులు, యువజన హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు పటాన్‌చెరు ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ధర్నా చౌక్‌కు బయల్దేరారు.యువత భవిష్యత్తు, విద్యార్థుల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఈ పోరాటానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.జై తెలంగాణ! జై బీఆర్ఎస్



# అరిచేతుల్లో హారతి

**- కె టీ ఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బీ ఆర్ ఎస్ పార్టీ యూత్ నాయకులు**

ప్రజాదివాస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పేటలో అతి పురాతనైనటువంటి కన్యక పరమేశ్వరి దేవాలయంలో బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించి బీ ఆర్ ఎస్ యూత్ నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ అంటే ఒక ధైర్యం రామన్న అంటే ఒక నమ్మకం రామన్న నే ఒక సైన్యం జన హృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపు కోవాలని మనస్ఫూర్తి గా కోరుకుంటున్నాము అన్నయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీ ఆర్ ఎస్ పార్టీ యూత్ నాయకులు నియోజవర్గం మాజీ అధ్యక్షుడు మోహన్ మండల నాయకులు ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్) వెంకన్నబాబు వెంకట సత్యనారాయణ (గణపతి) ఆరేపల్లి వెంకటేష్ (నాని) దాడిచర్ల ఏసుబాబు భరత్ కుమార్ భార్గవ్ బబ్లు శివ పవన్ రాకేష్ హేమంత్ . తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ దివ్య ఆశీస్సులతో భక్తిశ్రద్ధల మధ్య గురు వందనం కార్యక్రమం..

ప్రజాదివాస్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రామ నామస్మరణ గురు వందనం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభు రెడ్డి ప్రేమ దంపతులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సోని రెడ్డి దంపతులు, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి పాల్గొని శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ వారి ఆశీస్సులు పొందారు.అలాగే బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరామ నామస్మరణలో పాల్గొన్నారు. గురువందనం కార్యక్రమంలో భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తులు సామూహికంగా శ్రీరామ నామాన్ని జపిస్తూ గురువుల ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సామరస్యం, సత్సంకల్పాలను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ వారి దివ్య ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు.

# కేటీఆర్ 50వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు..

**- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

ప్రజాదివాస్



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దోమకొండ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని, తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షిస్తూ స్థానిక శ్రీ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆయన పేరుతో గోత్రనామాలపై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కుంచాల శేఖర్, పట్టణ అధ్యక్షుడు బోరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గజవాడ శ్రీకాంత్, బీసు సతీష్ కుమార్, నాయకులు మన్నె సాయిరెడ్డి, కూర చంద్రం, చిట్యాల రాజిరెడ్డి, కుంచాల సత్యం, బొబ్బసాని శంకర్, నేతుల చిన్న శ్రీనివాస్ యాదవ్, అనుమాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన తాటి

**- అన్నపురెడ్డిపల్లి గ్రంథాలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే తాటి**

ప్రజాదివాస్

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమాన్ని బూర్గంపాడు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాల పరిశీలన తదితర అంశాలను తాటి వెంకటేశ్వర్లు గారు పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు, పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని సందర్శించిన తాటి వెంకటేశ్వర్లు గారు అక్కడి పుస్తకాలు, సౌకర్యాలను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో కొద్దిసేపు ముచ్చటించి వారు చదువుతున్న పుస్తకాలు, పోటీ పరీక్షల సన్నద్ధత తదితర విషయాలపై ఆరా తీశారు. యువతలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలోబీ ఆర్ ఎస్ నాయకులు వేముల హరీష్ , మామిళ్లపల్లి లక్ష్మణరావు , సన్నేపల్లి సుధాకర్ ,అయిలూరి కృష్ణా రెడ్డి , కారం శివ , తేజావత్ శివ , భూపతి నరసింహారావు , చెరుకూరి ప్రసాద్ , అచ్చన రామకృష్ణ , వద్ది వెంకటేష్ , జూపల్లి కిరణ్ , నున్నా గోపాలరావు , తేజావత్ వస్రం , వీరబోయిన సీతారాం.



చెన్నుబోయిన సత్యం , అన్నపరెడ్డి సుబ్బారావు , ఇనప్పనూరి రాంబాబు , చల్లా రమేష్ ,సంతోష్ , మహంకాళి తిరుపతయ్య , బేతి శివ , ఎస్ కె సుభాని , మహమ్మద్ అలీ , అగ్గి కార్తీక్. ఇస్లావత్ లక్ష్మీ , తొల్లెం మల్లేష్ ,తిరుపతిరావు , ఇటుకల హరి , సత్యం , బుడెన్ ,తాటి సూర్యం, తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థులపై దాడి బాధాకరం. దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమం బీఎస్పీ ఆధ్వర్యంలో

ప్రజాదివాస్

బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ కుమారి మాయావతి. నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ ఆదేశాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహం వద్ద ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడి మరియు ఒక విద్యార్థిని చనిపోవడం చాలా బాధాకరం కేంద్ర ప్రభుత్వం జరిపిన దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మహబూబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తాండ్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య మూల స్తంభాలైన ఏ వ్యవస్థను కూడా పనిచేయడం లేదని కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 152 పరీక్ష పత్రాలు లీక్ అయినాయని ఇది ఆ



ప్రభుత్వం వైఫల్యం లేదా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థుల మీద నిర్లక్ష్యం అర్థం కావడం లేదు ప్రపంచ చరిత్రలో విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా నిలబడలేదని ఇది కేంద్ర ప్రభుత్వం లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ గమనంలోకి తీసుకోవాలని ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర పరిణామాలు దేశవ్యాప్తంగా ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు మాయావతి. నాయకత్వంలో పోరాటాలు చేస్తూ ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు కోల్లపూడి ప్రవీణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది, కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ పూలే జిల్లా ప్రధాన కార్యదర్శి కేశపాక కృష్ణ కోశాధికారి గూగుల్లో సరోజ కొత్తగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ మాదాసు ఓంకార్ భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షుడు చెన్నం మోహన్ రావు అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు వాసం పోలయ్య కొత్తగూడెం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పునూరి నాగయ్య కార్యదర్శి బండిపల్లి కిరణ్ చర్ల మండల అధ్యక్షుడు పాయిల్ మోహన్ సీనియర్ నాయకులు ఇరుప కామరాజ్ కొప్పుల రాంబాబు నియోజకవర్గాల నుండి నియోజకవర్గ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు

# నకిలీ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ మోసం ఛేదించిన దేవునిపల్లి పోలీసులు..

**-ముగ్గురు నిందితుల అరెస్ట్**

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ మధుసూదన్ సూచన**

ప్రజాదివాస్

దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్రాలు సృష్టించి విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన మోసాన్ని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారితో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు జిల్లా డీఎస్పీ మధుసూదన్ తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. దేవునిపల్లి వార్డు పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో సర్వే నెం.210/1లో ఉన్న ప్లాట్ నెం.71 అసలు యజమాని ముక్తవరం వెంకటయ్య పేరుపై ఉంది. అయితే ప్రధాన నిందితుడు బండారి శ్రీనివాస్ రెడ్డి తన వ్యక్తిగత అప్పులను తీర్చుకునేందుకు ఈ భూమిని అక్రమంగా విక్రయించాలనే ఉద్దేశంతో పథకం రచించాడు.ఈ క్రమంలో తన భార్య బండారి సునీతను కొనుగోలుదారుగా చూపించగా, తన మామ సంగారెడ్డిని అసలు యజమాని వెంకటయ్యగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి నకిలీ పత్రాలు, తప్పుడు వివరాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం అదే స్థలాన్ని ఇతరులకు విక్రయించి అక్రమంగా లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు.ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.316/2025 కింద కేసు నమోదు చేసి లోతుగా విచారణ చేపట్టారు. సేకరించిన ఆధారాలు, పత్రాల పరిశీలనలో నిందితుల కుట్ర వెలుగులోకి వచ్చింది. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో బండారి శ్రీనివాస్ రెడ్డి, బండారి సునీత, సంగారెడ్డిలను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా డీఎస్పీ మధుసూదన్ మాట్లాడుతూ, భూములు




కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలు, రెవెన్యూ రికార్డులు, యాజమాన్య హక్కులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలని ప్రజలకు సూచించారు. నకిలీ పత్రాలతో భూముల రిజిస్ట్రేషన్లు, మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ శ్రీధర్ గౌడ్, దేవునిపల్లి ఎస్సై రంజిత్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా .బీ ఆర్ ఏ ఓ యూ ఓపెన్ యూనివర్సిటీ పీజీ కోర్సులు ప్రారంభం

ప్రజాదివాస్

భద్రాచలం, జూలై 24: డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 202627 విద్యా సంవత్సరం నుంచి భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (లెర్నర్ సపోర్ట్ సెంటర్039)లో పీజీ కోర్సులను ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసింది.ఈ విద్యా సంవత్సరం నుంచి అధ్యయన కేంద్రంలో ఎం.ఏ. ఎకనామిక్స్, ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. ఇంగ్లీష్, ఎం.కామ్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పరిసర ప్రాంతాల విద్యార్థులు స్థానికంగానే పీజీ విద్యను అభ్యసించే అవకాశం లభించనుంది.ఉద్యోగులు, గృహిణులు, చదువు మధ్యలో నిలిపివేసిన వారు కూడా ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఈ కోర్సుల్లో చేరి ఉన్నత విద్యను కొనసాగించవచ్చని తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్‌లి మరియు బ్రౌ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
25-07-2026

# ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా విజయవంతమైన విద్యాసంస్థల బంద్

**– విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాటం నిరంతరం కొనసాగుతుంది**

**– ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్**

ప్రజాదివాస్

ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర అధ్యక్షులు పిలుపు మేరకు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ, విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ తెలిపారు.

ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల గొంతును అణచివేసే చర్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిపై బలప్రయోగం చేయడం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ సమర్థనీయం కాదన్నారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇతర విద్యాసంస్థల వద్ద ఎన్.ఎస్.యు.ఐ నాయకులు విద్యార్థులను కలిసి బంద్ ఆవశ్యకతను వివరించారని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛందంగా స్పందించి బంద్‌కు సహకరించడం వారి చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల తరఫున ఎన్.ఎస్.యు.ఐ ప్రధానంగా నాలుగు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచిందని అజ్మీర సురేష్ నాయక్ తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు:**

– కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి.– (ఎన్ టీ ఏ )ను వెంటనే రద్దు చేసి, పారదర్శకమైన కొత్త పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలి.– ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.– విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి )ను వెంటనే ఉపసంహరించుకోవాలి.విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్



చేశారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును పరిరక్షించడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని గుర్తు చేశారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత యువతపై ఉందని, విద్యార్థుల హక్కుల విషయంలో ఎన్.ఎస్.యు.ఐ ఎప్పుడూ రాజీపడదని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, సమాన విద్యావకాశాలు, ఉపాధి కల్పన, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో కూడా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉర్సు శివ, భానోత్ శ్రీధర్, తలారి మధు, కాటి సందీప్, షేక్ మోహిన్, షేక్ సమీర్, గూగులోత్ అశోక్, ఉబ్బపల్లి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు

ప్రజాదివాస్

భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మ దినము పురస్కరించుకొని మండల కేంద్రంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి



తమ ఆనందాన్ని పంచుకున్నారు . ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు కే వి రమణ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి గ్రామపంచాయతీలో నర్సరీలు ఏర్పాటుచేసి విధిగా ప్రతి సంవత్సరం హరితహారం పేరుతో ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంల జరిగింది అని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ బాపు బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ సంక్షేమ పథకాలు రైతుబంధు రైతు భరోసా లు , కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ , కాళేశ్వరం బ్యారేజ్ , కలెక్టరేట్లు , మెడికల్ కాలేజీలు, ఒంటరి మహిళలు వృద్ధులకు సామాజిక పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు .భారతదేశంలో తెలంగాణ అత్యధిక వరి దిగుబడి తో అన్నపూర్ణ రాష్ట్రంగా అవతరించిందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన లో అభివృద్ధి సంక్షేమం శూన్యం అని ఎద్దేవా చేశారు . రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం అని తెలంగాణ అభివృద్ధి పదంలో పయనించాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వం కావాలని సబండ వర్గాలు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారని ప్రజల ఆకాంక్షను ఈ సందర్భంగా తెలియజేశారు

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి

**– కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల గొంతును అణిచివేయాలని చూస్తుంది.**

**– యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగంతం కృష్ణ.**

ప్రజాదివాస్

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని ఏఐసీసీ అగ్రనేత లోక్సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఢిల్లీలో శాంతి యుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం సందర్భంగా ఆయనను అరెస్టు చేయడం పై హత్నూర మండల్ దౌల్తాబాద్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్యూఐ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ డాక్టర్ వరిగుంతం కృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధమని వరిగుంతం కృష్ణ తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ప్రతిపక్ష నాయకులు సైతం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హరిస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం ఆందోళనకరమనే అన్నారు రాహుల్ గాంధీ వంటి జాతీయ నాయకుడికి భద్రత ప్రజాస్వామ్య హక్కులకు గౌరవంలేని పరిస్థితి ఉంటే సామాన్య ప్రజలు విద్యార్థులకు ఎలాంటి రక్షణ కల్పిస్తారు అని కేంద్రాన్ని ప్రశ్నించారు అదేవిధంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సందీప్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులు భవిష్యత్తును ప్రభావితం చేసే నీట్ పరీక్షల నిర్వహణలో మోడీ ప్రభుత్వం పదేపదే విఫలం అవుతుందని విమర్శించారు ప్రశ్న పత్రాల లీకేజీలు నిర్వహణలో లోపాలు విద్యార్థుల ఆందోళనను పట్టించుకోకపోవడం వంటి అంశాలను పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు గత కొన్ని రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి విద్యార్థులను తమ న్యాయమైన డిమాండ్లను కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే వారి దేశద్రోహులుగా శత్రీకరించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని సందీప్ పేర్కొన్నారు ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్క పౌరునికి రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులను అన్ని దానిని అణచివేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు ప్రజల గొంతులను నిలిచివేయడం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు రాజకీయాలు చేయడం విద్యార్థులను సమస్యల నిర్లక్ష్యం చేయడం వంటి చర్యలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోతుందని అన్నారు ప్రజాస్వామ్య ని రాజ్యాంగాన్ని దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ప్రజా వ్యతిరేక విధానాలను తగిన సమయంలో ప్రజలే ప్రజాస్వామ్య బద్ధంగా సమాధానం చెప్తారని డాక్టర్ వరిగుంతం కృష్ణ యూత్ కాంగ్రెస్ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ స్పష్టం చేశారు ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కులను



అనుసరించడం దేశ రాజ్యాంగ స్ఫూర్తి విరుద్ధం విద్యార్థుల భవిష్యత్తులతో రాజీ పడే ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరు అన్నారు అదేవిధంగా యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ రాహుల్ గాంధీ కోసం నిరంతరం ప్రధానమంత్రి చేయడం కోసం కష్టపడతారని తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ అరిగేసాయి నియోజవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి హత్నూర మండల్ వైస్ ప్రెసిడెంట్లు మధు అశ్విని ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు ఆంజనేయులు వల్లి గారి సాయి నర్సాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ దౌల్తాబాద్ వార్డు సభ్యులు శ్రీను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అడ్డు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు సతీష్ పటేల్ మహేందర్ యాదవ్ తర్కంపేట్ వార్డు సభ్యులు విక్రమ్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఫరూక్ ఎన్ ఎస్ యు ఐ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్‌కు కామారెడ్డిలో విశేష స్పందన..

**– నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రికి రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్**

ప్రజాదివాస్

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నిరసనగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపుకు కామారెడ్డి జిల్లాలో విశేష



స్పందన లభించింది. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్.ఎస్.యు.ఐ. ఎస్.ఎఫ్.ఐ. బి.వి.ఎం. పి.డి.ఎస్.యు. జి.వి.ఏం.ఏ.ఐ.ఎస్.ఎఫ్. తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత స్వీకరిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.బంద్ సందర్భంగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కామారెడ్డి పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు సహకరించడంతో విద్యాసంస్థలు మూతపడ్డాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా కార్యదర్శి భరత్ టింకు, ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్,బి.వి.ఏం. రాష్ట్ర కార్యదర్శి విఠ్ఠల్, వినోద్, పి.డి.ఎస్.యు నాయకులు సురేష్, జబ్బర్, వినయ్, ప్రవీణ్, సోఫియాన్, డేవిడ్, అనిరుధ్, నరేష్తో పాటు వివిధ విద్యార్థి సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ అణచివేతకు నిరసనగా వట్పల్లి కాంగ్రెస్ నిరసన

ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం వట్పల్లి మండల అధ్యక్షుడు వజనాల విశ్వాస్ గారి ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అణచివేత ధోరణి, దాష్టీకానికి నిరసనగా వట్పల్లి మండల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేయడం జరిగింది.విశ్వాస్ మాట్లాడుతూ విద్యార్థుల గొంతును అణచివేయడం విరుద్ధమని అన్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, భావ ప్రకటనా స్వేచ్ఛను, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య హక్కులను కల్పించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో,రాయికోడ్ మండల ఆత్మ కమిటీ ఛైర్మన్



కచూర్ రావు సార్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ పాటిల్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పెద్దపట్ల వినయ్ గౌడ్,యన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు ఖాజా,శివశంకర్,రాజిరెడ్డి, పత్రి విఠల్, దిగంబర రావ్ కళ్యాణ్,శంకర్,శ్రీనివాస్, రుక్మొద్దీన్, ఇస్మాయిల్,సర్పంచులు రవీందర్,మోహన్

# పదో వార్డులో తడి చెత్త పొడి చెత్త పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్

**– ఈ కార్యక్రమంలో పాల్గొన్న పదవ వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్**

ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపాలిటీ 10, వ వార్డులో కౌన్సిలర్ పట్లోళ్ళ రేఖ ప్రవీణ్ అన్న అద్వర్యం లో ప్రతి ఇల్లు – పరిశుభ్రత పాటించాలి అని ఈరోజు మన మున్సిపల్ కమిషనర్ ఉ



సిబ్బంది మన వార్డ్ ప్రజలకు తెలియజేశారు అంతేకాకుండా తడి చెత్త పొడి చెత్త ఎలక్ట్రికల్ ఐటమ్స్ కెమికల్ ఐటమ్స్ వేరువేరుగా చేయాలని పట్లోళ్ల రేఖ ప్రవీణ్ అన్న తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్యాల మధు అలాగే మున్సిపల్ సిబ్బంది మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు ....

# విద్యార్థుల ఆందోళనకు మద్దతు: సల్మాన్‌పై ట్రోల్స్.. ఎందుకంటే..?



నీట్ పేపర్ లీకేజీ వివాదంపై ఆందోళన చేస్తోన్న విద్యార్థులకు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. పేపర్ లీక్ అనేది అత్యంత తీవ్రమైన సమస్య అని ఆయన అన్నారు. విద్యార్థులు శాంతియుతంగా చేపట్టిన ఈ ఉద్యమం ద్వారా దేశంలో మంచి విద్యావ్యవస్థ ఏర్పాటవుతుందని ఆశిస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అయితే, ఈ వ్యాఖ్యల అనంతరం సల్మాన్ పై నెట్టింట విమర్శలు వస్తున్నాయి. గతంలో తన తండ్రితో కలిసి ఓ టాక్ షోకు హాజరైన ఆయన.. పేపర్ లీక్ గురించి సరదాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు విమర్శలకు దారితీస్తున్నాయి. అందుకు సంబంధించిన పాత వీడియో ఒకటి వైరల్ అవుతోంది.ఆ టాక్ షోలో సల్మాన్ తండ్రి సలీమ్ మాట్లాడుతూ.. "మా ఇంటికి గణేశ్ అనే వ్యక్తి వచ్చేవాడు. అతడు ఎప్పుడు వచ్చినా అందరూ ఎంతో మర్యాద ఇచ్చేవారు. టీ ఇవ్వండి, కుర్చీ వేయండి.. అని హడావుడి చేసేవారు. దీంతో అతడెవరా అని ఆరా తీశాను. తీరా చూస్తే.. మా ఇంట్లో వాళ్లకు పరీక్ష పేపర్లు లీక్ చేసేవాడని, అందుకే అతడికి అంత మర్యాదలు చేస్తున్నారని అర్థమైంది" అని నవ్వుతూ చెప్పారు. తండ్రి వార్తలకు సల్మాన్ స్పందిస్తూ.. 'మా నాన్న చెబుతోంది నా గురించే' అని సరదాగా అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతుండగా.. సల్మాన్ తీరును కొందరు విమర్శిస్తున్నారు.మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారం రోజురోజుకీ తీవ్రరూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ మొదలుపెట్టిన ఈ ఆందోళనలకు విపక్షాలు, సినీ ప్రముఖులు మద్దతు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు.

# 'ప్రళయ్'లో కల్యాణి యాక్షన్ స్టంట్స్!



సూపర్ హీరో చిత్రం 'లోకా చాప్టర్ 1: చంద్ర'లో ప్రధానపాత్ర పోషించి తెరపై యాక్షన్ సన్నివేశాలతో అదరగొట్టి సినీప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంది మలయాళ తార కల్యాణి ప్రియదర్శన్. గతేడాది ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించిన కల్యాణి.. ఇప్పుడు వరుస చిత్రాలతో బిజీగా ఉంది. ఆమె ఖాతాలో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించనున్న 'ప్రళయ్' సినిమా కూడా ఉందని హిందీ చిత్రసీమలో ఎప్పట్నుంచో జోరుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా కల్యాణి గురించి మరో ఆసక్తికర కబురు వినిపించింది. ఈ చిత్రంలో ఆమె.. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతోపాటు హై ఆక్టేన్ స్టంట్స్ చేయబోతుందని తెలిసింది. జాంబీ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ సినిమాకి జై మెహతా దర్శకత్వం వహించనున్నారని ఇటీవల ప్రముఖ నిర్మాత హన్సల్ మెహతా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్స్ పనుల్ని పూర్తి చేసుకుంటున్న ఈ సినిమాని వచ్చే నెలలో సెట్స్ పైకి తీసుకెళ్లనుందట చిత్రబృందం. దీపావళికి మొదటి షెడ్యూల్ పూర్తి చేసి రణ్‌వీర్ పితృత్వ విరామం తీసుకుంటున్నట్లు సమాచారం. తదుపరిగా కల్యాణి 'లోకా 2'తో పాటు 'జీని', 'మార్షల్' సహా పలు చిత్రాలలో కనిపించనుంది.

# మరోసారి జోడీగా



రవితేజ - డింపుల్ హయాతి కలిసి ఇప్పటికే రెండు చిత్రాల్లో మెరిశారు. ముచ్చటగా మూడోసారి ఈ జోడీ సందడి చేయడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. 'రాజ రాజ చోర', 'శ్వాగ్' చిత్రాల ఫేం హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ చిత్రం చేయనున్నారు. దిల్‌రాజు నిర్మాణంలో రూపొందనున్న ఈ సినిమాలో శ్రీవిష్ణు మరో కథానాయకుడు. ఇందులోనే రవితేజకు జోడీగా డింపుల్ హయాతి నటించనున్నట్టు సమాచారం. ఆమె ఎంపిక దాదాపుగా ఖరారైనట్టు తెలిసింది. ఇదివరకు 'ఖిలాడి', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాల్లో ఈ జోడీ కలిసి సందడి చేసింది. మరి రవితేజ సరసన డింపుల్ నటిస్తే, శ్రీవిష్ణుకి జోడీగా ఎవరనేది తేలాల్సి ఉంది. ఈ సినిమా కోసం అగ్ర కథానాయిక పూజా హెగ్డేనీ చిత్రబృందం సంప్రదించినట్టు సమాచారం. ఆమె ఓకే అంటే ఈ కలయిక మరింత ఆసక్తికరంగా మారనుంది. వచ్చే నెలలోనే ఈ సినిమా పట్టాలెక్కనుంది.

# నాతో పనిచేసిన వాళ్లందరూ మంత్రులయ్యారు: బాబీ దేవోల్



హిందీతో పాటు, ఇతర భాషల్లోనూ వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్న నటుడు బాబీ దేవోల్ ఆయన ప్రతినాయకుడిగా నటించిన తాజా చిత్రం 'జన నాయగన్' . గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ విజయ్ అభిమానులను అలరిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో బాబీ దేవోల్ సరదా వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కాలంలో తనతో పనిచేసి వారందరూ మంత్రులు అవుతున్నారని వ్యాఖ్యానించారు.విజయ్ ప్రచారానికి దూరంగా ఉంటారని ఈ సందర్భంగా బాబీ తెలిపారు "నేను కూడా పెద్దగా ప్రచారాలు చేయను. ఆయన (విజయ్) కూడా శ్రుతిమించిన ప్రచారాన్ని ఇష్టపడరు. మనం చేసే పనే మాట్లాడుతుందని అంటారు. నాక్కూడా అలాగే ఉండటం ఇష్టం. దక్షిణాది నటులతో పనిచేసేటప్పుడు నేనొక విషయాన్ని గుర్తించా. నాతో పనిచేసిన వారందరూ మంత్రులయ్యారు. బాలకృష్ణ 'డాకు మహారాజ్'లో నటించాను. ఆయన సుదీర్ఘంగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. ఇక పవన్‌కల్యాణ్‌తో 'హరి హర వీరమల్లు' చేశా. ఆయన మంత్రి, డిప్యూటీ సీఎంగా అయ్యారు. ఇప్పుడు విజయ్‌తో 'జన నాయగన్' చేశా. ఆయన ఏకంగా సీఎం అయ్యారు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. సూర్యతో కలిసి చేసిన 'కంగువా' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయినా, ఆయనతో పనిచేయడం చాలా సరదాగా ఉందన్నారు.



# 'టాక్సిక్'..పెద్దలకు మాత్రమే: నిర్మాత క్లారిటీ

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన వీడియోలు నెట్టింట తీవ్ర చర్చకు దారి తీశాయి. మితిమీరిన శృంగార సన్నివేశాలున్నాయంటూ కొందరు పోస్ట్‌లు పెట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాత కె. నారాయణ 'టాక్సిక్' గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇది అన్ని సినిమాల్లాంటిది కాదన్నారు."టాక్సిక్ అనేది చాలా గొప్ప ప్రాజెక్ట్. భారీ స్థాయిలో దీన్ని రూపొందిస్తున్నాం. మేము ఇప్పటివరకు చేసిన చిత్రాలకంటే ఈ కథ భిన్నంగా ఉంటుంది. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమా చూసినప్పుడు కచ్చితంగా దీన్ని ఆస్వాదిస్తారు. గొప్ప చిత్రం తెరకెక్కించారంటూ మమ్మల్ని అభినందిస్తారు. ఆ నమ్మకం నాకుంది. మరో ఆసక్తికర విషయమేమిటంటే.. 'టాక్సిక్' కేవలం పెద్దల కోసం రూపొందించిన ఓ కల్పిత కథ" అని నారాయణ తెలిపారు.ఇక ఈ సినిమాలో నుంచి తాజాగా 'మనసాగదే..' అనే సాంగ్ విడుదలైన విషయం తెలిసిందే. యశ్ (ఘంప్ర), తారా సుతారియా మధ్య తెరకెక్కించిన ఈ సాంగ్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. దీని గురించి తారా సుతారియా పోస్ట్ పెట్టారు. ఈ పాట మధ్యలో వచ్చే కొన్ని సన్నివేశాలు చాలా అందంగా తెరకెక్కించారని తెలిపారు. ఇక ఈ సినిమాలో ఈమెతో పాటు నయనతార, రుక్మిణి వసంత్, కియారా అడ్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది.

# అభిమానుల ఎదుగుదలే నాపై చూపించే నిజమైన ప్రేమ: చిరంజీవి




"నా అభిమానుల్ని ఇష్టపడతాను. వాళ్లు ఎదిగితే ప్రాణప్రదంగా చూసుకుంటాను. నన్ను స్ఫూర్తిగా తీసుకుని అందరూ గర్వించేలా ఎదిగారంటే అదే వాళ్లు నాపై చూపించే నిజమైన ప్రేమ అని భావిస్తా. అలాంటి అభిమానుల్ని ఈ వేదికపై చూడటం ఆనందంగా ఉంది" అన్నారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఆయన ముఖ్య అతిథిగా 'చెన్నై లవ్‌స్టోరీ' విడుదలకు ముందస్తు వేడుక బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శ్రీగౌరీ ప్రియ కథానాయిక. రవి నంబూరి దర్శకుడు. సాయిరాజేశ్, ఎస్.కె.ఎన్ కలిసి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది.వేడుకని ఉద్దేశించి చిరంజీవి మాట్లాడుతూ "సినిమా పేరు వినగానే చెన్నైతో ఉన్న నా అనుబంధం గుర్తొచ్చింది. ఈ పేరులోనే ఓ మ్యాజిక్ ఉంది. ఈ వేడుకకి రావడానికి ప్రధానమైన కారణం నా అభిమానులే. ఎస్.కె.ఎన్, సాయిరాజేశ్, రవి నంబూరి, కిరణ్ అబ్బవరం సోదరుడు నా అభిమానులు. కిరణ్.. పవన్‌కల్యాణ్ అభిమాని. జీవితంలో ఎదిగిన అభిమానుల్ని చూసి ముచ్చటపడిపోతుంటా. నా అభిమానిగా పరిశ్రమకు వచ్చిన ఎస్.కె.ఎన్ విజయవంతమైన నిర్మాతగా ఎదిగాడు. సాయిరాజేశ్ రెండు జాతీయ పురస్కారాలు పొంది నా అభిమానుల్లో తలమానికంగా మారాడు. రవి నంబూరి తొలి సినిమా ఇది. వీళ్లంతా సాదాసీదా కుటుంబం నుంచి వచ్చినవాళ్లే. కానీ వీరి కలలు అసాధారణంగా ఉంటాయి. అదే ఈ స్థాయికి తీసుకొచ్చింది.ప్రతి ఒక్కరూ కలలు కనాలి, నమ్మకంతో ముందడుగు వేస్తే తప్పకుండా అనుకున్నది సాధిస్తారు. కిరణ్ అబ్బవరం మన పక్కింటి అబ్బాయిలా కనిపిస్తాడు. అతడి లాంటి కొత్త రక్తం పరిశ్రమకి రావాలి. తను మరింత ఉన్నతస్థాయికి చేరాలని కోరుకుంటున్నా.